సాక్షి నల్లగొండ

బుధవారం : 4 : జనవరి : 2023



భూముల పరిశీలన

దామరచర్ల మండలంలోని సోలార్ ప్లాంటుకు అవసరమయ్యే భూములను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. - 8లో



గోవర్ధనగిరిధారిగా..

అధ్యయనోత్సవాల్లో భాగంగా స్వామివారు ఉదయం మురళీకృష్ణుడిగా రాత్రి గోవర్ధన గిరిధారిగా భక్తులకు దర్శనమిచ్చారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0°/18.0°

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. రాత్రిపూట చలి మోస్తారుగా ఉంటుంది.

న్యూస్‌రీల్

యాదాద్రి జోన్ డీఐజీగా రెమా రాజేశ్వరి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ ఎస్పీ రెమా రాజేశ్వరిని యాదాద్రి జోన్ డీఐజీగా ప్రభుత్వం నియమించింది. ఎస్పీ కేడర్‌లోనే ఆమె కొనసాగుతారని పేర్కొంది. అలాగే తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు నల్లగొండ ఎస్పీగా కూడా ఆమెనే కొనసాగుతారని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేష్ కుమార్ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు.

ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలి



ఎంపీ లేఖను అందజేస్తున్న శంకర్‌నాయక్

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి వద్ద నిర్మించ తలపెట్టిన కృష్ణా – గోదావరి పవర్ ప్లాంట్‌ను, రసాయనిక పరిశ్రమపై ఈనెల 5న నిర్వహించే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ కోరారు. మంగళవారం ఈ మేరకు జిల్లా కేంద్రంలో అదనపు కలెక్టర్‌ను, కాలుష్య నియంత్రణ మండలి అధికారులను కలిసి ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాసిన లేఖను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల యాజమాన్యం కుట్రపూరితంగా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయాల్సిన ప్రజాభిప్రాయాన్ని గ్రామానికి 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరిశ్రమ ఆవరణలో ఏర్పాటు చేయడం దారుణమన్నారు. వెంటనే ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గాజుల శ్రీనివాస్, ఎల్‌వీ.సత్యనారాయణ, దేవడ్ల సుబ్బయ్య, బత్తుల శ్రీనివాస్, చెన్నయ్య, దుర్గాప్రసాద్, భిక్షమాచారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇంధనం తరలిస్తే చర్యలు

డిండి : అనుమతులు లేకుండా ఇంధనం, రేషన్ సరుకులు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాల శాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ మాచన రఘునందన్ హెచ్చరించారు. మంగళవారం నల్లగొండ – నాగర్‌కర్నూల్ జిల్లా సరిహద్దు ప్రాంతమైన డిండిలో హైదరాబాద్ – శ్రీశైలం హైవేపై వెళ్తున్న పెట్రోల్, డీజిల్ ట్యాంకర్లకు సంబంధించిన పత్రాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాల నుంచి తెలంగాణకు అక్రమంగా ఇంధనం సరఫరా అవుతుందన్న సమాచారం మేరకు రాష్ట్రంలో నిఘా పెట్టామని తెలిపారు. అదేవిధంగా పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై కూడా దృష్టి పెట్టామన్నారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి



రికార్డులను పరిశీలిస్తున్న ప్రేమ్‌కరణ్‌రెడ్డి

కట్టంగూర్ : ఉద్యోగులు సమయపాలన పాటించాలని జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. వార్షిక ఆదాయ, వ్యయ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పోరెళ్ల సునీత, ఎంపీఓ అథర్‌ఫర్వేజ్ సిబ్బంది ఉన్నారు.

పేద విద్యార్థులకు విద్యనందించాలి

చింతపల్లి : సావిత్రిబాయి పూలే ఆశించిన విధంగా గ్రామీణ స్థాయి విద్యార్థులకు విద్యను అందించాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ ఆకాంక్షించారు. మంగళవారం మండల పరిధిలోని కుర్మేడులో ఏర్పాటు చేసిన సావిత్రిబాయి పూలే జయంతి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారతదేశ ప్రజలు, మహిళలకు విద్యనందించేందుకు మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే అనేక సమస్యలను ఎదుర్కొన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బహుజన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు పోలె విష్ణు, ఎంపీటీసీ కుంభం శ్వేత, బాలకృష్ణ, ఆంజనేయులు, యాదగిరి, వెంకటేష్ పాల్గొన్నారు.

పన్నులు.. ఎక్కడివక్కడే!

పట్టణాల్లో పేరుకుపోతున్న నీటి, ఆస్తి పన్ను బకాయిలు

- కష్టంగా మారుతున్న మున్సిపాలిటీల నిర్వహణ
- వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు తంటాలు
- నల్లగొండలో సత్ఫలితాన్నిస్తున్న డిజిటల్ ఇంటి నంబర్ల ప్రక్రియ



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : జిల్లాలోని మున్సిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరైన ఆస్తి పన్ను, నీటి పన్ను సక్రమంగా వసూలు కావడం లేదు. మున్సిపాలిటీ అధికారులు అలసత్వంతో పన్నులు పేరుకుపోతున్నాయి. దీంతో పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంట్లు తగ్గిపోవడం, కేంద్ర, రాష్ట్ర పథకాల కింద వచ్చే మొత్తాలను రోడ్లు, పట్టణ ప్రకృతి వనాలు, జంక్షన్ల అభివృద్ధి, నాలాలు వంటి పనులకే వెచ్చించాల్సి వస్తోంది. ఇక వార్డుల్లో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా మున్సిపాలిటీకీ వచ్చే పన్నులే ఆధారం. కానీ వాటిని వసూలు చేయడంలో మున్సిపాలిటీలు చేస్తున్న నిర్లక్ష్యం పట్టణాల అభివృద్ధికి శాపంగా మారుతోంది. వార్డుల్లో చిన్న చిన్న అభివృద్ధి పనులు, డ్రెయినేజీ, శానిటేషన్, దోమల నివారణ వంటి ఏ పనులు చేపట్టాలన్నా నిధులు ఉండడం లేదు. ఒక్క నల్లగొండ మున్సిపాలిటీ మినహా జిల్లాలోని మిగతా మున్సిపాలిటీల్లో ఇదే పరిస్థితి ఉంది. నిబంధనల ప్రకారం ఆవాసాలన్నింటి నుంచి రావాల్సిన ఆస్తి పన్ను వసూలు చేయడం లేదని, ఫలితంగా పట్టణాభివృద్ధి అంతంతగానే మారిందనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

ఫలితాలిస్తున్న డిజిటల్ డోర్ నంబర్లు..

నల్లగొండ మున్సిపాలిటీల్లో డిజిటల్ నెంబర్ల ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ప్రస్తుతం మున్సిపాలిటీలో 37,200 ఆవాసాలు ఉన్నాయి. వాటి ద్వారా దాదాపు రూ.23 కోట్ల పన్నులు రావాల్సి ఉన్నా అంతగా రావడం లేదు. పట్టణంలోని అన్ని ఆవాసాలకు డోర్ నంబర్లు లేని కారణంగా పన్నులు వసూలు కావడం లేదు. ఈ ఏడాదే కాస్త మెరుగుపడింది. మున్సిపల్ కమిషనర్‌గా రమణాచారి వచ్చాక ఇళ్ల సర్వే చేపట్టి ఆదాయాన్ని పెంచే పనిలో పడ్డారు. మరోవైపు డిజిటల్ డోర్ నంబర్ల విధానం చేపట్టారు. అది ఇప్పటి వరకు 30 శాతం పూర్తయింది. ఇందులోనే రెండు వేలకు పైగా ఇళ్లకు ఇంటి నంబర్లు లేనట్లుగా గుర్తించారు. ఇప్పుడు వాటన్నింటికి డోర్ నంబర్లు ఇచ్చి ఇంటి పన్ను వసూలు చేస్తున్నారు. 2019–20లో కేవలం రూ.3.77 కోట్లే వసూలుకాగా.. 2020–21 సంవత్సరంలో రూ.14.88 కోట్లు, 2021–22 సంవత్సరంలో రూ.11.42 కోట్లు వసూలైంది. ఇక 2022–23 సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.17.45 కోట్లు వసూలు చేశారు. నీటి పన్ను కూడా రెట్టింపు వసూలైంది. మిగతా మున్సిపాలిటీల్లో ఉన్న ఆవాసాలకు వసూలవుతున్న పన్నుకు పొంతన లేదని ఓ ఉన్నతాధికారే వ్యాఖ్యానించారు. డిజిటల్ సర్వే పూర్తయితే పక్కాగా ఇంటి పన్ను విధానంలో మార్పు వస్తుందని, మున్సిపాలిటీల ఆదాయం మెరుగు పడుతుందని పేర్కొన్నారు.

మున్సిపాలిటీల్లో ఏడాదిలో వసూలైన ఇంటి పన్ను (రూ.కోట్లలో)

చిట్యాల	0.70
నకిరేకల్	1.35
దేవరకొండ	1.80
చండూరు	0.50
హాలియా	1.90
మిర్యాలగూడ	8.0
నల్లగొండ	17.45

నీటి పన్నులో సగం కూడా వసూలు కాలే..

చిట్యాల మున్సిపాలిటీలో భవనాలు 3,397 ఉండగా, అందులో 2,218 భవనాలకు నల్లా కనెక్షన్లు ఉన్నట్లుగా లెక్కలు ఉన్నాయి. వాటి ద్వారా మూడేళ్లలో రూ.7,98,4800 పన్ను వసూలు కావాల్సి ఉండగా, కేవలం రూ.2.40 లక్షలే వచ్చాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. నకిరేకల్‌లోనూ అదే పరిస్థితి ఉంది. అక్కడ 8,570 నివాసాల ద్వారా నీటి పన్ను రూ. 25.15 లక్షలు వసూలు కావాల్సి ఉన్నా కేవలం రూ.5.75 లక్షలే వసూలవుతోంది. దేవరకొండలో 6,952 ఇళ్లకుగాను మూడేళ్లలో నీటి పన్ను రూపంలో రూ.2.01 కోట్లు వసూలు కావాల్సి ఉన్నా రూ.31 లక్షలు వచ్చాయి. చండూరులో 3,400 భవనాలు ఉండగా, రూ.9 లక్షలు నీటి పన్ను రావాల్సి ఉండగా.. రూ.2.30 లక్షలే వసూలైంది. హాలియాలో 5,408 ఆవాసాలు ఉండగా.. రూ.7.54 లక్షలు రావాల్సి ఉన్నా రూ.4.15 లక్షలు వసూలైంది. మిర్యాలగూడ మున్సిపాలిటీలో 25,026 ఇళ్ల ద్వారా నీటి పన్ను రూ.3.60 కోట్లు రావాల్సి ఉన్నా రూ.1.90 కోట్లు వసూలైంది. ఇక నందికొండ మున్సిపాలిటీలో అన్ని నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రభుత్వ క్వార్టర్లే కావడంతో ఎలాంటి పన్నులను చెల్లించడం లేదు.

విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపునకే తొలిమెట్టు



బోధనోపకరణాలను పరిశీలిస్తున్న డీఈఓ భిక్షపతి

- జిల్లా విద్యాశాఖ అధికారి భిక్షపతి
- టీఎల్‌ఎం మేళా సందర్శన

నల్లగొండ : విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంపొందించేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని డీఈఓ భిక్షపతి తెలిపారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన మండలస్థాయి బోధనాభ్యసన సామగ్రి మేళాను మంగళవారం ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు తయారుచేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను పరిశీలించి వాటి ఉపయోగాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని 26 మండలాల్లో మంగళవారం టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పాఠాలు సులభంగా అర్థం చేసుకునేలా టీచింగ్, లెర్నింగ్ మెటీరియల్ విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అత్యుత్తమ మెటీరియల్‌ను ఎంపిక చేసి జిల్లాస్థాయి మేళాలో ప్రదర్శిస్తామని.. జిల్లాస్థాయిలో అత్యుత్తమమైన వాటిని ఎంపిక చేసి రాష్ట్రస్థాయికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ కూకుట్ల నర్సింహ, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి ఉమామహేశ్వరచారి, రాష్ట్ర పరిశీలకులు మంగారెడ్డి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌గౌడ్, చామల చంద్రశేఖర్, జయరాములు, ప్రమీలారాణి, లింగయ్య, ధర్మానాయక్, నిర్మల్‌రెడ్డి, పరుశురాములు, ఉపాధ్యా సంఘాల నాయకులు ఫణికుమార్, తరాల పరమేశ్ యాదవ్, వనం లక్ష్మీపతి, బత్తుల భాస్కర్, వీరమళ్ల శ్రీనివాస్‌గౌడ్, కడారి కృష్ణయాదవ్, సైదులు, రవీందర్, దమనేశ్వర్ రావు, షాహిన్ తయ్యబ్, మారెడ్డి వెంకట్‌రెడ్డి, పోలె వెంకటయ్య, మేడిగ రఘు, రామకష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు విజయవంతానికి చర్యలు

- కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, పక్కన జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్యేలు

నల్లగొండ: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతం కోసం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు.. మంత్రులు జగదీశ్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్‌లతో కలిసి మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా స్థాయి అధికారుల, ప్రజాప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 74 టీమ్‌లు ఏర్పాటు చేశామని.. రిజర్వ్‌లో 4 టీమ్‌లు ఉంచామని తెలిపారు. ఈ నెల 12లోగా మంత్రి జగదీశ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సన్నాహక సమావేశం నిర్వహిస్తామన్నారు. కంటి వెలుగు క్యాంప్‌లు నిర్వహించే లొకేషన్ నిర్ణయించి విజయవంతం చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, రవీంద్రకుమార్ నాయక్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా, మున్సిపల్ చైర్మన్ సైదిరెడ్డి, డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొండల్‌రావు, డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

బాలకార్మికుల్లో 'స్మైల్'

- ఆపరేషన్ స్మైల్ ప్రారంభం
- పని ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించనున్న అధికారులు
- జిల్లాలో మూడు బృందాల ఏర్పాటు



అనాథాశ్రమాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నల్లగొండ : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 9వ విడత కార్యక్రమం జిల్లాలో ప్రారంభమైంది. ఏటా జనవరిలో 1వ తేదీ నుంచి 30వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించాల్సి ఉండగా.. జిల్లాలో పోలీస్ ఉద్యోగాలకు ఈవెంట్స్ ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ సారి 3వ తేదీ నుంచి ప్రారంభించారు. అందుకు సంబంధించి మొత్తం 3డివిజన్లకు 3 బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో నలుగురు చొప్పున సభ్యులు ఉండి పని ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహించనున్నారు.

2015 నుంచి స్పెషల్ డ్రైవ్..

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలకునకు ప్రభుత్వం 2015 నుంచి సంవత్సరం నుంచి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు నిర్వహిస్తోంది. జనవరి నెలలో ఆపరేషన్ స్మైల్, జూలైలో ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలు చేపడుతుతోంది. బాలల పరిరక్షణ విభాగం, లేబర్ ఆఫీస్, పోలీసుల శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నెలరోజులపాటు జిల్లా వ్యాప్తంగా మెకానిక్ షాపులు, పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటళ్లు, మిల్లులు తదితర పని ప్రదేశాల్లో తనిఖీలు నిర్వహిస్తుంది. జిల్లాలోని పని ప్రదేశాల్లో ఎక్కువ మంది మహారాష్ట్ర, ఒడిశా తదితర ప్రాంతాలకు చెందినవారే ఉంటున్నారు. వారంతా ఇటుకబట్టీలు, కార్ఖానాల్లో పని చేస్తున్నారు. వారిని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నారు. ఎలాంటి ఆధారం లేకుండా తల్లిదండ్రులు లేని వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసులు నమోదు చేయడంతోపాటు, జరిమానా విధిస్తున్నారు.

ఇప్పటి వరకు 2428 మంది గుర్తింపు..

2015 నుంచి ఇప్పటివరకు 16 సార్లు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కార్ఖానాలు, ఇటుక బట్టీలు తదితర పని ప్రదేశాల్లో మగ్గుతున్న 2,428 మంది బాల కార్మికులను గుర్తించారు. ఇందులో 1,898 మంది బాలురు, 530 మంది బాలికలు ఉన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న 325 మంది యజమానులపై కేసులు నమోదు చేశారు. కొందరి యజమానులకు ఫైన్ కూడా విధించి వారి నుంచి వచ్చిన డబ్బులను బాలకార్మికుల ఖాతాలో జమ చేశారు.

ఎన్నికల హామీలన్నీ నెరవేరుస్తాం



మాట్లాడుతున్న మంత్రి హరీష్‌రావు, పక్కన మంత్రి జగదీశ్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

- శివన్నగూడ, కిష్టరాయిన్‌పల్లి నిర్వాసితులకు ప్లాట్లు ఇస్తాం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరగాలి
- మర్రిగూడలో 30 పడకల ఆస్పత్రి ప్రారంభోత్సవంలో మంత్రి హరీష్‌రావు



పరికరాలను పరిశీలిస్తున్న మంత్రులు హరీష్‌రావు, జగదీశ్‌రెడ్డి

మర్రిగూడ : మునుగోడు ఉప ఎన్నికలో ఇచ్చిన హామీలను అమలు చేయడంతోపాటు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం చొరవ చూపుతుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో 30 పడకల సామాజిక ప్రభుత్వ ఆస్పత్రిని మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించి మాట్లాడారు. మర్రిగూడ గ్రామపంచాయతీలో డ్రెయినేజీలు, సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.50లక్షలు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. శివన్నగూడ, కిష్టరాయనపల్లి ప్రాజెక్టుల భూనిర్వాసితులకు త్వరలోనే ప్లాట్లు కేటాయించి డబుల్‌బెడ్‌రూంలు కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. నల్లగొండ జిల్లాలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 950 మంది డాక్టర్లను నియమిస్తే అందులో 8మందిని మర్రిగూడ ఆసుపత్రికి కేటాయించామని, అంబు లెన్స్ అందించామని, డిజిటల్ ఎక్స్‌రేను కూడా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కాగా, ఆస్పత్రిని వంద పడకలకు అప్‌గ్రేడ్ చేయాలని ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకంట్ల సుభాష్‌తోపాటు పలువురు వినతిపత్రం అందచేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య తక్కువగా ఉంది

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని మంత్రి హరీష్‌రావు పేర్కొన్నారు. నల్లగొండ జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 59శాతం, ప్రైవేట్‌లో 49శాతం ప్రసవాలు జరుగుతున్నాయని.. రాష్ట్ర సగటు కంటే కంటే 7శాతం తక్కువగా ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెరిగేలా కలెక్టర్, డీఎంహెచ్‌ఓ కృషి చేయాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం.. ఏమాత్రం సహకరించకున్నా రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందన్నారు. బోరుబావుల వద్ద మోటార్లకు మీటర్లు పెట్టనందుకు ఐదేండ్ల నుంచి సంవత్సరానికి రూ.6వేల కోట్ల చొప్పున రూ.30వేల కోట్లను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. కల్యాణలక్ష్మి, రైతు బంధు, రైతుబీమా పథకాలను అమలు చేస్తుంటే కేంద్రంలోని బీజేపీ కుట్రలు చేసి రూ.12వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వానికి రాకుండా నిలిపి వేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, వైద్య విధాన పరిషత్ రాష్ట్ర కమిషనర్ అజయ్ మిశ్రా, కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, అదనపు కలెక్టర్ కుష్బూ గుప్తా, ఆర్డీఓ గోపీరాం, డీఎంహెచ్‌ఓ కొండల్‌రావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కృష్ణకుమారి, ఆరోగ్య మిత్ర రాష్ట్ర అధ్యక్షుడు గిరి యాదయ్య, ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, సర్పంచ్ నల్ల యాదయ్య, చెరుకు లింగంగౌడ్, బచ్చు రామకృష్ణ పాల్గొన్నారు.

నెరవేరనున్న గొర్రెల పథకం లబ్ధిదారుల కల

- మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆగిపోయిన నగదు బదిలీ పథకం
- 15 రోజుల్లో అమలుకు నిర్ణయం



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: మునుగోడు ఉప ఎన్నిక సమయంలో ఆగిపోయిన గొర్రెల పంపిణీలో నగదు బదిలీ పైలట్ ప్రాజెక్ట్ త్వరలోనే అమలు కాబోతోంది. పైలట్ ప్రాజెక్ట్ కింద చేపట్టిన నగదు బదిలీ పథకం లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని లబ్ధిదారులకు 15 రోజుల్లో గొర్రెలను కొనుగోలు చేసి ఇవ్వాలని నిర్ణయించారు. నల్లగొండ, యాదాద్రి భువనగిరి జిల్లాలో లబ్ధిదారులకు ఒకొక్కరికి ప్రభుత్వ వాటా ధనం రూ.1.58 లక్షల చొప్పున వారి ఖాతాలకు నగదును బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అందులో ఒక్క మునుగోడు నియోజకవర్గ పరిధిలో 4,699 మంది లబ్ధిదారుల ఖాతాలలో ప్రభుత్వం సొమ్ము జమ చేసింది. ఉప ఎన్నిక కోడ్ అమలులోకి రావడంతో గొర్రెల యూనిట్ల పంపిణీలో జాప్యం జరిగింది. ఈ నేపథ్యంలో వారందరికి గొర్రెల పంపిణీ యూనిట్లను అమలు చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా పశువైద్యాధికారులను మంత్రి ఫోన్‌లో ఆదేశించారు. దీంతో త్వరలోనే లబ్ధిదారులకు గొర్రెల యూనిట్లు అమల్లోకి రానున్నాయి.

మంత్రి తలసానికి గొల్ల కురుమల వినతి

మునుగోడు : మునుగోడు నియోజకవర్గంలోని గొల్ల కురుమల బ్యాంక్ ఖాతాలపై ఫ్రీజింగ్‌ని వెంటనే ఎత్తివేయించాలని కోరుతూ రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంగళవారం యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు మేకల యాదన్న యాదవ్ ఆధ్వర్యంలో పలువురు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గొల్ల కురుమల బ్యాంకు ఖాతాలు ఫ్రీజింగ్‌లో ఉండటంతో ఇటీవల ప్రభుత్వం అందించిన రైతుబంధు నగదుతో పాటు ఇతర బ్యాంక్ లావాదేవీలు జరిపేందుకు అవకాశం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఆ ఇబ్బందులను వెంటనే తొలగించాలని, గొర్రెల పంపిణీకి అందించిన నగదుతో వెంటనే గొర్రెలను ఇప్పించాలని కోరారు. స్పందించిన మంత్రి తలసాని వారం, పది రోజులల్లో ఫ్రీజింగ్ ఎత్తివేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. వినతిపత్రం అందించినవారిలో యాదవ సంఘం నాయకులు జక్కలి ఐలయ్యయాదవ్, ఈడుగుల ఐతయ్య యాదవ్, నల్లజెట్టి పురుషోత్తం, సల్ల సైదులు, జెట్టి శ్యామ్, సత్యనారాయణ, వంశీకృష్ణ, నాగరాజు, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే భూములపై అధికారుల విచారణ

మిర్యాలగూడ : మిర్యాలగూడ– విష్ణుపురం రైల్వేస్టేషన్ల మధ్య రైల్వే భూముల ఆక్రమణపై అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. సోమవారం 'రైల్వే భూముల కబ్జా' అనే శీర్షిన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు రైల్వే జనరల్ మేనేజర్ ఆదేశానుసారం నడికుడికి సంబంధించిన పర్మిట్ వే ఇన్‌స్పెక్టర్ రాంభద్రం, రైల్వే సీఐ ఇంగ్లేతోపాటు పదిమంది రైల్వే అధికారులు నడికుడి నుంచి విష్ణుపురం, దామరచర్ల, మిర్యాలగూడ తదితర ప్రాంతాల్లో మంగళవారం ట్రాలీపై వెళ్తూ సర్వే నిర్వహించారు. దామరచర్ల మండలంలోని కొత్తూరు, విష్ణుపురం రైల్వేట్రాక్‌ల పక్కన వ్యాపార డబ్బాలను తొలగించాలని, ట్రాక్ సమీపంలో సాగు చేస్తున్న రైతులను పిలిచి సాగు చేయవద్దని అవసరమైతే కేసులు నమోదు చేస్తామని రైల్వే అధికారులు హెచ్చరించారు.

సాక్షి ఎఫెక్ట్..

హోల్డ్ ఎత్తేసిన బ్యాంక్ అధికారులు

మునుగోడు : రుణాలు చెల్లించలేదని పలువురు రైతుల బ్యాంక్ ఖాతాలను హోల్డ్ చేసిన మునుగోడు ఏపీజీవీబీ అధికారులు మంగళవారం ఎత్తివేశారు. ఇటీవల ప్రభుత్వం రైతుబంధు అందించగా ఆ డబ్బులు తీసుకోకుండా హోల్డ్‌లో పెట్టడంతో మంగళవారం 'పంట రుణాల ఖాతాలు హోల్డ్' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించన బ్యాంకు అధికారులు హోల్డ్ చేసిన రైతుల ఖాలాలను రిలీజ్ చేశారు. అంతే కాకుండా 'సాక్షి' దినపత్రికకు తన గోడు విన్నవించిన రైతు యాదమ్మని బ్యాంక్‌కు పిలిపించి రైతుబంధు నగదు అందించారు. దీంతో ఆ మహిళా రైతుతో పాటు వివిధ రైతు సంఘాల నాయకులు 'సాక్షి'కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

బాలుడు అదృశ్యం


ఇలియాస్ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్ : ఇంటి నుంచి స్కూల్‌కు వెళ్లిన బాలుడు కనిపించకుండా పోయిన సంఘటన మిర్యాలగూడ పట్టణంలోని బంగారుగడ్డలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగడ్డకు చెందిన షేక్ ఇలియాస్ (13) రోజు మాదిరి గానే సోమవారం స్కూల్‌కు వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు తమ కు తెలిసిన వారి ఇళ్ల వద్ద వెతికినా కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బాలుడు బ్లూ కలర్ ప్యాంట్, రెడ్, బ్లూ చెక్స్ చొక్కా కలిగిన స్కూల్ యూనిఫాం ధరించి ఉండి, సన్నగా నాలుగు అడుగుల ఎత్తు, ఛామనచాయ రంగులో ఉంటాడని పేర్కొన్నారు. గుర్తించిన వారు సమాచారం అందించాలని, పూర్తి వివరాలకు 98491 06766, 99599 92135 నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

హుజూర్‌నగర్‌లో యువతి..

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీలో మంగళవారం ఓ యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. అదేకాలనీకి చెందిన కొలపూడి కమలాకర్ కుమార్తె కవిత ఖమ్మంలోని ఎస్‌ఆర్‌ఎండీ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. ఇటీవల ఆమె ఖమ్మం నుంచి ఇంటికి వచ్చింది. మంగళవారం కుటుంబ సభ్యులు రోజువారీ పనినిమిత్తం బయటకు వెళ్లారు. వారు వెళ్లిన కొంతసేపటికే కవిత ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

నేరేడుచర్ల : నేరేడుచర్ల మండలంలోని పత్తేపురం వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాలువలో గల్లంతైన మచ్చ సైదులు మృతదేహం మంగళవారం లభ్యమైంది. నేరేడుచర్ల ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పత్తేపురం వద్ద గల నాగార్జునసాగర్ ఎడమ కాలువ వద్దకు మచ్చ సైదులు ఈనెల 1న ఈత కొట్టేందుకు వెళ్లి గల్లంతయ్యాడు. ఈయన మృతదేహం గరిడేపల్లి మండలం పొనుగోడు రిజర్వాయర్‌లో మంగళవారం కనిపించింది. పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించామని, మృతుడి తల్లి పున్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గోవర్ధనగిరిధారిగా నృసింహుడు


గోవర్ధనగిరిధారి అలంకరణలో స్వామివారు

- ఉదయం వేణుగోపాలస్వామిగా దర్శనమిచ్చిన యాదాద్రీశుడు

యాదగిరిగుట్ట : వైకుంఠ ఏకాదశి సందర్భంగా యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో ప్రారంభమైన అధ్యయనోత్సవాలు మంగళవారం రెండవ రోజు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం స్వామి వారిని వేణుగోపాల స్వామి (మురళీకృష్ణుడి)గా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రధానార్చకులు అలంకార సేవకు హారతినిచ్చి తిరువీధి సేవోత్సవం జరిపించారు. ఈ సందర్భంగా ఆళ్వారులు కీర్తించిన ప్రబంధాల్లోని పాశురాలను అనుసంధానం చేశారు. ప్రధానాలయం తిరు, మాఢవీధుల్లో విహరిస్తున్న శ్రీస్వామి వారి సేవ ఎదుట పారాయణీకులు, రుత్వికులు, ఆచార్యులు పాశురాలను పఠించారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈఓ గీతారెడ్డి, ఆలయ ప్రధానార్చకులు, ఉపప్రధానార్చకులు, రుత్వికులు, పారాయణీకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు. అదేవిధంగా శ్రీస్వామి వారిని ఆలయంలో నిత్యారాధనల అనంతరం రాత్రి ద్రావిడ ప్రబంధ సేవా కాలం నిర్వహించారు. ప్రథమ ప్రాకార మండపంలో స్వామివారిని గోవర్ధనగిరిధారిగా అలంకరించి తిరు, మాఢవీధుల్లో ఊరేగించారు.

అలంకరణ పట్ల అశ్రద్ధ

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి అధ్యయనోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న అలంకరణ సేవల్లో అశ్రద్ధ కనిపిస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. మంగళవారం రాత్రి నిర్వహించిన గోవర్ధనగిరిధారి అలంకార సేవలో గోవర్ధన పర్వతాన్ని చిటికెన వేలుతో శ్రీస్వామి వారు ఎత్తిన దృశ్యాన్ని థర్మకోల్ షీట్‌పై తయారు చేసి పెట్టడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గోవర్ధన పర్వాతాన్ని ఎత్తుకునే దృశ్యం భక్తుల కళ్లకు కట్టినట్లు చూపెట్టిన ఆచార్యులు, ఈ సారి మాత్రం థర్మకోల్ షీట్‌పై తయారు చేసి పెట్టడం ఏంటని భక్తులు ప్రశ్నిస్తున్నారు.


గతేడాది నిర్వహించిన అధ్యయనోత్సవాల్లో గోవర్ధన పర్వతాన్ని ఎత్తుకొని ఉన్న దృశ్యం (ఫైల్)

కంటెయినర్ ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలు


ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన కంటెయినర్

మిర్యాలగూడ : రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన వేములపల్లి గ్రామ శివారులోని అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిపై శెట్టిపాలెం క్రాస్ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన చిలుక వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి ద్విచక్ర వాహనంపై శెట్టిపాలెం వెళ్లి తిరిగి వేములపల్లికి వస్తున్నారు. శెట్టిపాలెం క్రాస్‌రోడ్డు వద్ద అద్దంకి– నార్కట్‌పల్లి రహదారిని దాటుతుండగా అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపునకు వెళ్తున్న కంటెయినర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో చిలుక వెంకట్‌రెడ్డి కుడి చేయి విరగడంతోపాటు తలకు తీవ్ర గాయాలయ్యాయి. నారాయణరెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తీవ్ర గాయాలపాలైన చిలుక వెంకట్‌రెడ్డిని మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించగా వైద్యులు సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

భువనగిరి : రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలైన సంఘటన భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. మంగళవారం హైదరాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తున్న కారు భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డు మార్గంలో ముందుగా వెళ్తున్న బైకును ఢీ కొట్టిన అనంతరం ముందున్న మరో కారును, బైకును ఢీ కొట్టింది. దీంతో బైకు మీద వెళ్తున్న జనగాం మండలం చౌదరిపల్లి గ్రామానికి చెందిన భవానీ, రాజుతో పాటు యాదగిరిగుట్ట మండలంలో దాతరపల్లి గ్రామానికి చెందిన మరో వ్యక్తికి గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం పట్టణంలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తేజంరెడ్డి తెలిపారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన రమేష్

కట్టంగూర్ : మద్యం సేవించొద్దని భార్య మందలించడంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని ఈదులూరు గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. అదే గ్రామానికి చెందిన పోలగోని రమేష్(46) సోమవారం మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. గమనించిన భార్య మందలించింది. దీంతో మద్యం మత్తులో ఉన్న రమేష్ క్షణికావేశంలో తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే రోజు రాత్రి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం వ్యవసాయ బావివద్దకు చూసేసరికి అప్పటికే మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు శివ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి ఇల్లు దగ్ధం


దగ్ధమైన ఇంట్లోని సామగ్రి

నకిరేకల్ : గ్యాస్ సిలండర్ పేలి ఇళ్లు దగ్ధమైన సంఘటన నకిరేకల్‌లోని చీమలగడ్డలో మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. పర్వతం నాగరాజు, శంకరమ్మ దంపతులు నకిరేకల్ మున్సిపాలిటీలోని 6వ వార్డు జంగాల కాలనీలో నివాసముంటున్నారు. రోజు మాదిరిగానే శంకరమ్మ ఉదయం అన్నం వండేందుకు గ్యాస్ స్టౌవ్ వెలిగించింది. సిలిండర్ లీక్ కావడంతో ఒక్కసారిగా మంటలు లేవడంతో భయంతో బయటకు పరుగులు తీసింది. సిలండర్ పేలి పెద్దఎత్తున మంటలు లేచి ఇళ్లు దగ్ధమైంది. నాగరాజు నిమ్మ తోటల పడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇంటిలోని దాచుకున్న రూ.2లక్షల నగదు, వంట సామగ్రి, బియ్యం, పిల్లల స్టడీ సర్టిఫికెట్లు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.5 లక్షల పైనే నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. సంఘటనా స్థలాన్ని టీపీసీసీ నేత దైద రవీందర్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతాకుల అంజయ్య పరిశీలించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

పోలీసులు దూషించడంతోనే..

- తమ కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యుల ఆరోపణ
- మృతదేహంతో పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన


మృతదేహంతో ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

పాలకవీడు : ఓ ప్రమాద ఘటనలో అకారణంగా పోలీసులు స్టేషన్‌కు పిలిపించి దూషించడంతోనే తమ కుమారుడు మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుడి తల్లిదండ్రులు పాలకవీడు మండలంలోని గుడుగుంట్ల పాలెం గ్రామానికి చెందిన షేక్ లతీఫ్, లతీఫ్‌బీ, వారి బంధువులు ఆరోపిస్తూ మంగళవారం పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. షేక్ నాగుల్‌మీరా(20) డిసెంబరు 31 రాత్రి స్నేహితులతో కలిసి బైక్‌పై గుడుగుంట్లపాలెం నుంచి పాలకవీడుకు వెళ్తున్నాడు. అదే సమయంలో పాలకవీడు గ్రామానికి చెందిన పగడాల జ్యోతిబసు, యరగొర్ల సైదులు పాలకవీడు నుంచి గుడుగుంట్లపాలెం వైపు బైక్‌పై వస్తుండగా భారత్ పెట్రోల్‌బంక్ సమీపంలో తమ కుమారుడు వెళ్తున్న వాహనాన్ని ఢీ కొట్టారని ఆరోపించారు. ఆ సమయంలో తమ కుమారుడి కాలుకు స్వల్ప గాయాలు కాగా.. పగడాల జ్యోతిబసుకు తీవ్ర గాయాలు కావడంతో వారి కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మరుసటి రోజు జనవరి 1న పగడాల జ్యోతిబసు కుటుంబ సభ్యులు ప్రమాద ఘటనపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు తమ కుమారుడిని స్టేషన్‌కు పిలిపించి ప్రమాదానికి కారణం నువ్వే అని దూషించడంతో మనస్తాపం చెంది మంగళవారం ఉదయం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబసభ్యులు వాపోయారు.

కుటుంబ సభ్యుల ఆందోళన

సంబంధం లేని కేసు విషయంలో తమ కుమారుడిని ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి దూషించాడని, ఈ కారణంగానే మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు, బంధువులు స్టేషన్ ఎదుట మృతదేహంతో బైఠాయించి ధర్నాకు దిగారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామలింగారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి నుంచి ఫిర్యాదును స్వీకరించారు. బుధవారం ఉదయం జ్యోతిబసు కుటుంబసభ్యులను కూడా పిలిపించి మాట్లాడి న్యాయం చేస్తామని తెలిపారు. అయినా కుటుంబ సభ్యులు భీష్మించుకుని కూర్చున్నారు. ఈక్రమంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. ఆందోళన చేస్తున్న వారిని చెదరగొట్టి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

తండ్రి మందలించడంతోనే..

ఈ విషయంపై డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ షేక్ నాగుల్‌మీరా, అతడి స్నేహితులను పిలిపించి విచారించామని, చిన్న వయసులో తాగి రోడ్లపై ప్రమాదాలకు కారణం కావడం మీ భవిష్యత్‌కు మంచిది కాదని హెచ్చరించామని తెలిపారు. అయితే అదే రోజు సాయంత్రం ఇంటికి వెళ్లిన నాగుల్ మీరాను తండ్రి మందలించడంతోనే మనస్తాపానికి గురై ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు వెల్లడించారు. ఇందులో పోలీసుల తప్పిదమేమీ లేదని పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఇరువురి కుటుంబాలను స్టేషన్‌కు పిలిపించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకుంటామని తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరి పరిస్థితి విషమం

తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని మాదాపూర్ వద్ద మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడం వల్ల ఒకరికి తీవ్రగాయలై పరిస్థితి విషయంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామానికి చెందిన తిరుకోవలూరా ఉపేందర్ మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వైపు వెళ్తుండగా, హైదరాబాద్ నుంచి మోటర్‌సైకిల్ పై వస్తున్న బిచ్చాల రాజు మాదాపూర్ వద్ద ఎదురుగా ఢీ కొనడంతో ఉపేందర్‌రావుకు తీవ్రగాయాలయ్యాయి. రాజుకు స్వల్ప గాయలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ఉపేందర్‌రావును భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బంధువులు హైదరాబాద్‌కు తరలించారు.

బావిలో యువకుడి మృతదేహం లభ్యం

సూర్యాపేట రూరల్ : మండల పరిధిలోని దాస్‌తండా గ్రామంలో మంగళవారం యువకుడి మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహం ఈ నెల 1న ఇంటి నుంచి వెళ్లిపోయిన గ్రామానికి చెందిన సునావత్ మహేష్(20)దిగా పోలీసులు గుర్తించారు. ఇంటి నుంచి వెళ్లిపోయిన మహేష్ కోసం తండ్రి హతీరాం వెతుకుతున్నాడు. మంగళవారం ఉదయం గ్రామ శివారులో లాలు వ్యవసాయ బావిలో శవమై కనిపించడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వ్యక్తి ఆత్మహత్య

అడ్డగూడూరు : అడ్డగూడూరు మండల పరిధిలోని మంగమ్మగూడెంలో ఓ వ్యక్తి కడుపునొప్పి భరించలేక మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ ఉదయ్‌కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగమ్మగూడేనికి చెందిన కడారి పెద్ద వీరయ్య(80) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం రాత్రి భోజనం చేసి ఇంటి వరండాలో పడుకున్నాడు. చికిత్స పొందినప్పటికీ కడుపు నొప్పి తగ్గకపోవడంతో మానసిక ఒత్తిడికి గురై వ్యవసాయ పొలానికి వెళ్లి చెట్టు కొమ్మకి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మంగళవారం ఉదయం కుంటుబ సభ్యులు చూసేసరికి ఇంటి ఎదుట లేకపోవడంతో వ్యవసాయ పొలానికి వెళ్లి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నూతన డీజీపీని కలిసిన బెటాలియన్ కమాండెంట్

నల్లగొండ క్రైం : నూతన డీజీపీ అంజన్‌కుమార్‌ను అన్నెపర్తి బెటాలియన్ కమాండెంట్ సాంబయ్య మంగళవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.


డీజీపీని కలిసిన కమాండెంట్ సాంబయ్య

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

బీబీనగర్ : బీబీనగర్ రైల్వేస్టేషన్‌లో డిసెంబర్ 31న అనారోగ్యానికి గురైన గుర్తు తెలియని సుమారు 60సంవత్సరాల వ్యక్తిని రైల్వే పోలీసులు చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించగా మంగళవారం మృతి చెందాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ ఇన్‌చార్జ్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

కట్టంగూర్ : మండలంలోని ముత్యాలమ్మగూడెం జీపీ పరిధి ఆంజనేయస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్టంపల్లి సర్పంచ్ పనస సైదులు, అదే గ్రామానికి చెందిన రామస్వామితో కలిసి ద్విచక్రవాహనంపై సోమవారం రాత్రి కట్టంగూర్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు వెళ్లగానే విజయవాడ నుంచి హైదరాబాదు వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనపై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆస్పత్రికి వెళ్లి ఇరువురిని పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.50వేల ఆర్థికసాయం చేశారు.

ట్రాక్టర్‌ను డీసీఎం ఢీకొన్న ఘటనలో..

పామనగుండ్ల గ్రామానికి చెందిన రైతు పల్లె నరేష్ తన కుటుంబ సభ్యులతో వ్యవసాయబావి నుంచి ట్రాక్టర్‌పై ఇంటికి బయలుదేరారు. పామనగుండ్ల బస్‌స్టాప్ సమీపంలో జాతీయ రహదారిపై ఉన్న డివైడర్‌ను దాటే క్రమంలో మంగళవారం రాత్రి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న డీసీఎం అతివేగంగా వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ఉన్న నరేష్, కళ్యాణి, మణిదీప్, మహాలక్ష్మి, రిత్వికలకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే క్షతగాత్రులను పరామర్శించారు.

అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించాలి

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

సాక్షి, యాదాద్రి : పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రెవెన్యూ, పోలీసు అధికారులను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలపై దాడులను అరికట్టేందుకు కృషి చేయాలన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి విజిలెన్స్ మానిటరింగ్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. పౌర హక్కులపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ షెడ్యూల్ ప్రకారం క్రమం తప్పకుండా పౌరహక్కుల దినోత్సవం నిర్వహించాలని, రెండు రోజుల ముందు గ్రామాల్లో ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. ఎస్సీ, ఎస్టీ కేసుల విషయంలో బాధితులకు అందజేసేందుకు ప్రభుత్వం ఈ ఏడాది రూ.70,00,000 అందజేసిందని వెల్లడించారు. మానిటరింగ్ కమిటీ సభ్యులు, శివలింగం, సుదర్శన్, నర్సింగరావు, తిరుమలేష్, రాజన్ నాయక్, భాస్కర్, అదనపు కలెక్టర్ దీపక్‌తివారీ, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

సామాజిక సేవలకు గుర్తింపు


లింగంగౌడ్‌ను సన్మానిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు


పూలే అవార్డు అందుకుంటున్న పద్మ


ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు లావణ్య


పోతిరెడ్డిపల్లి సర్పంచ్ మాధవి

మిర్యాలగూడ టౌన్ : వివిధ సామాజిక రంగాల్లో కృషి చేసినందుకుగాను మిర్యాలగూడకు చెందిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్, మహిళా నాయకురాలు జయమ్మ సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, బీసీ కమిషన్ చైర్మన్ కృష్ణమోహన్‌రావు, మునిమంజరిలు ఈ అవార్డు అందజేసి ఘనంగా సన్మానించారు.

పద్మను వరించిన సావిత్రిబాయి పూలే అవార్డు

పెద్దవూర : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నిమ్మల పద్మ మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పద్మను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి, మెమొంటో, సర్టిఫికెట్ అందించారు. అవార్డు రావడం పట్ల పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు శైలజ, రామ్మోహన్, శ్రీనివాస్, శంకర్, కర్ణాకర్ హర్షం వ్యక్తం చేశారు.

పోతిరెడ్డిపల్లి సర్పంచ్ మాధవికి అవార్డు

ఆత్మకూరు(ఎం) : ఆత్మకూరు(ఎం) మండలం పోతిరెడ్డిపల్లి సర్పంచ్ గనగాని మాధవి సావిత్రిబాయి పూలే రాష్ట్ర స్థాయి అవార్డు అందుకున్నారు. గ్రామ స్థాయిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సామాజిక సేవలకు గుర్తింపుగా ఆమె ఈ అవార్డు అందుకున్నారు.

అవార్డు అందుకున్న లావణ్య

భువనగిరి : భువనగిరికి చెందిన ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు ఇటికాల లావణ్య రాష్ట్ర స్థాయి సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఆమె నిర్వహించిన సామాజిక సేవ కార్యక్రమాలకు గాను మంగళవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో బీసీ మహిళా సంఘం ఆధ్వర్యంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నారు.

తుర్కపల్లి వాసికి పూలే అవార్డు

తుర్కపల్లి : మండల కేంద్రానికి చెందిన బాలల సంక్షేమ సమితి సభ్యురాలు కళాశికం రుద్రమదేవి చేసిన సామాజిక సేవ కార్యక్రమాలకు గాను రాష్ట్ర బీసీమహిళ సంఘం మంగళవారం సావిత్రిబాయి పూలే అవార్డును అందుకున్నారు. ఈసందర్భంగా రుద్రమదేవిని సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ బండారు జయశ్రీ, సీడబ్ల్యూసీ సభ్యుడు మల్లేశం, శివరాజు, డీసీపీఓ సైదులు, దశరథ అభినందించారు.

సోలార్ ప్లాంట్‌కు భూముల పరిశీలన


తిమ్మాపురంలో రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు


అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు మొక్క అందజేస్తున్న ఆర్డీఓ చెన్నయ్య

మిర్యాలగూడ : దామరచర్ల మండంలోని తిమ్మాపురం గ్రామంలో నిర్మించనున్న సోలార్ విద్యుత్ ప్లాంటు అవసరమయ్యే భూములను మంగళవారం అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పరిశీలించారు. ఇటీవల సీఎం కేసీఆర్ యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణ పనులను పరిశోలించిన సందర్భంగా సోలార్ విద్యుత్ ప్లాంటు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించగా అందుకు సంబంధించిన భూములను పరిశీలించేందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు. యాదాద్రి పవర్‌ప్లాంట్ నిర్మాణానికి 5400 ఎకరాల భూమిని ప్రభుత్వం సేకరించగా 2015లో సుమారు 4200 ఎకరాలను టీఎస్ జెన్‌కోకు అప్పగించారు. మిగతా 1200 ఎకరాలపై సర్వే నిర్వహించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో అదనపు కలెక్టర్.. అధికారులతో కలిసి భూములను పరిశీలించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. అయితే సోలార్ ప్లాంటుకు భూములు ఇచ్చేది లేదని రైతులు చెప్పడంతో క్షేత్రస్థాయిలో పరిస్థితిని ప్రభుత్వానికి నివేదిస్తామని ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట ఆర్డీఓ చెన్నయ్య, తహసీల్దార్ ఖాదర్, ఆర్‌ఐ సతీష్ తదితరులు ఉన్నారు.

భూసేకరణపై సమీక్ష

మిర్యాలగూడ : దామరచర్ల యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ప్రాజెక్టు భూసేకరణపై అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ చెన్నయ్యతో కలిసి సమీక్షించారు. పవర్‌ప్లాంట్‌కు 4676 ఎకరాల అటవీ భూమిని కేటాయించగా అందులో 3300 ఎకరాలు స్వాధీనం చేసుకుందని.. మిగిలిన భూమికి సంబంధించి క్షేత్రస్థాయిలో ఉన్న అభ్యంతరాలను ఆర్డీఓ చెన్నయ్య అదనపు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో కార్యాలయ డీఏఓ రాధా, డీఐ బాలాజీనాయక్, సిబ్బంది జమాల్, హాజీ, సుహాసిని, మమత, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.